సాక్షి
మంచిర్యాల
మంగళవారం । 25 । జూలై । 2023



భయం.. భయం

జిల్లాలో శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది భయం భయంగా విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. వర్షాకాలం కావడంతో భయాందోళన వ్యక్తమవుతోంది. 9లో▸



పెరిగిన రోగుల సంఖ్య

మంచిర్యాలటౌన్: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం ఓపీ 400 దాటింది. జ్వరాలతోనే వస్తుండడంతో రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. వైరల్ జ్వరాలు, డయేరియా, టైఫాయిడ్ కేసులు నమోదవుతున్నాయి.

గరిష్టం/కనిష్టం
29.0 /25.0

వాతావరణం

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి. వాతావరణం చల్లగా ఉంటుంది.

దంచికొట్టిన వాన



కన్నెపల్లి మండలంలో మత్తడి దూకుతున్న ఒడ్డాలమ్మ చెరువు

- జిల్లాలో 61.3 మిల్లీమీటర్లు
- ఏడు మండలాల్లో అత్యధికం
- పొంగిన వాగులు, వంకలు
- నీట మునిగిన పంట పొలాలు
- మరో మూడు రోజులు భారీ వర్ష సూచన

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో సోమవారం తెల్లవారు జామున వర్షం దంచికొట్టింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం వరకు 61.3 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. లక్సెట్టిపేట, దండేపల్లి, హాజీపూర్, కాసిపేట నస్పూర్, మంచిర్యాల, బెల్లంపల్లి మండలాల్లో అత్యధిక వర్షం కురిసింది. మిగతా ప్రాంతాల్లో ఓ మోస్తారు నుంచి భారీ వర్షం పడింది. వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. ప్రాజెక్టులు, చెరువుల్లోకి భారీగా వరద నీరు చేరింది. పలు మార్గాల్లో వంతెనలపై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పంట పొలాలు చెరువులను తలపించాయి. లోతట్టు ప్రాంతాల్లోని పత్తిచేనుల్లో ఇసుక మేటలు వేశాయి. రోడ్లు కోతకు గురయ్యాయి. సింగరేణి ఓపెన్‌కాస్టు ప్రాంతంలో ఆదివారం రాత్రి షిఫ్టు, సోమవారం ఉదయం షిఫ్టు బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. ఆదివారం పొద్దంతా ఎండ మండిపోగా రాత్రి మబ్బులు కమ్ముకొని సోమవారం ఉదయం భారీ వర్షం కురిసింది.

గోదావరిలోకి భారీగా వరద నీరు

మహారాష్ట్రతోపాటు జిల్లాలో కురుస్తున్న వర్షాలతో ప్రాణహిత నది, గోదవరి నది పరవళ్లు తొక్కుతోంది. కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టులకు ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద నీరు వస్తుండటంతో గేట్లు ఎత్తి లక్షల క్యూసెక్కుల నీరు దిగువన గోదావరినదిలోకి వదులుతన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిమట్టం 13 గేట్లు ఎత్తి 2,28,690 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలారు. ర్యాలీవాగు ప్రాజెక్టు నీటిమట్టం 151.50 మీటర్ల సామర్థ్యం కాగా ప్రస్తుతం 147.200 మీటర్లకు చేరింది. 200 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. గొల్లవాగు ప్రాజెక్టు నీటిమట్ట సామర్థ్యం 155.50 మీటర్లు కాగా 152.400 మీటర్లకు చేరింది. ఎగువ ప్రాంతం నుంచి 140.772 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. నీల్వాయి ప్రాజెక్టు నీటిమట్ట సామర్థ్యం 124 మీటర్లు కాగా పూర్తి స్థాయికి చేరింది. 900 క్యూసెక్కుల వరదనీరు వస్తుండగా.. మత్తడి నుంచి 100 క్యూసెక్కుల నీరు దిగువ ప్రాంతానికి వెళ్తోంది.

నీటమునిగిన పంటలు

జిల్లా వర్షాలతో పంట చేనులలో భారీగా వర్షపు నీరు చేరాయి. పంటలు దెబ్బతింటుండడంతో అన్నదాతలు ఆగమవుతున్నారు. ఎడతెరిపి లేని వర్షాలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పత్తి, కంది, వరినారుమడులు దెబ్బతిని రైతులు నష్టపోతున్నారు. రెండ్రోజులు వర్షాలు కాస్తా విరామం ఇవ్వడంతో ఎదిగే దశలో ఉన్న పంటల్లో కలుపు నివారణతోపాటు ఎరువులు వేసుకున్నారు. మళ్లీ ఎడతెరిపి లేని భారీ వర్షాలు ముంచుతున్నాయి. మరోమూడు రోజులు భారీ వర్ష సూచనతో పంటలకు నష్టం జరిగే అవకాశం ఉంది.



రాళ్లవాగు ప్రవాహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

లోటు నుంచి అధికం

జిల్లా సాధారణ వర్షపాతం జూన్ 1 నుంచి 24 వరకు 407.1 మిల్లీమీటర్లు కాగా 481.3 మిల్లీమీటర్లు కురిసింది. 18 శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఈ నెల 17 వరకు సాధారణ వర్షపాతం కన్న 15 శాతం లోటు ఉండగా.. వారం రోజులుగా ఎడతెరిపి లేని భారీ వర్షాలతో లోటు నుంచి 18 శాతం అధికంగా నమోదైంది. 8 మండలాల్లో 20 నుంచి 40 శాతం అధిక వర్షపాతం నమోదు కాగా, 10 మండలాల్లో సాధారణ స్థాయి వర్షపాతం నమోదైంది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం వరకు 61.3 మిల్లీమీటర్ల భారీవర్షంతో ఒక్కసారిగా అధిక వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది ఇదే అధికం కావడం గమనార్హం.



కన్నెపల్లి మండలంలో నీటమునిగిన పత్తి చేను

జిల్లాలో నమోదైన వర్షపాతం

లక్సెట్టిపేట మండలంలో 117.6 మిల్లీమీటర్లు, దండేపల్లిలో 112.3, కాసిపేటలో 108.8, హాజీపూర్‌లో 105.6, నస్పూర్‌లో 82.0, బెల్లంపల్లిలో 77.9, మంచిర్యాలలో 73.4, మందమర్రిలో 61.3, నెన్నెలలో 53.6, జైపూర్‌లో 45.8, జన్నారంలో 40.1, భీమారంలో 27.2, చెన్నూర్‌లో 29.3, కోటపల్లిలో 24.2, తాండూర్‌లో 40.5, వేమనపల్లిలో 35.0, కన్నెపెల్లిలో 45.0, భీమినిలో 23.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

నిలిచిన రాకపోకలు..



రహదారిపై వాగు నీటిని పరిశీలిస్తున్న సీఐ క్రిష్ణ

లక్సెట్టిపేట: మండలంలోని పోతపల్లి గ్రామానికి వెళ్లేందుకు ఉన్న ప్రదాన రహదారికి మద్యలో వాగు ఉండడంతో వర్షాలు కురవగ ఆదివారం రాత్రి నుండి వాగుపై నీరు పారుతుంది. దీంతో గ్రామానికి పట్టణానికి రాకపోకలు స్తంభించాయి. నిత్యం వివిద పనుల కోసం పట్టణానికి రావాలన్న, అత్యవసర వేళలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక సీఐ క్రిష్ణ, ఎస్సై లక్ష్మణ్ పోలీసులు వెళ్లి పరిశీలించారు. ప్రజలు అత్యవసరమైతే సమాచారం ఇవ్వాలని వాగు నీరు తగ్గేంత వరకు రావద్దని సూచించారు.

ఉప్పొంగిన రాళ్లవాగు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డు నుంచి రంగంపేట్‌కు వెళ్లే దారిలో రాళ్లవాగుపై నిర్మించిన కాజ్‌వే సోమవారం వరద నీటిలో మునిగిపోయింది. దీంతో రంగంపేట్, ఆండాళమ్మ కాలనీ, పవర్‌సిటీ కాలనీకి వెళ్లే ప్రజలు పాతమంచిర్యాల బ్రిడ్జి నుంచి తిరిగి వెళ్లాల్సి వచ్చింది.

అండర్ బ్రిడ్జిలోకి వరద నీరు

జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జిలో వరద నీరు చేరింది. రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఈ వర్షాకాలంలో వరద నీరు చేరిన వెంటనే మోటార్ల ద్వారా తొలగించనున్నట్లు అధికారులు తెలిపినా, ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు.

కొనసాగుతున్న గేట్ల ఎత్తివేత



గేట్లు ఎత్తడంతో గోదావరిలో కలుస్తున్న నీరు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎల్లంపల్లి ప్రాజెక్టుకు సోమవారం ఇన్‌ఫ్లో లక్ష క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా అంతే స్థాయిలో 12 గేట్లు ఎత్తి గోదావరినదిలోకి వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలకు గాను 16.105 టీఎంసీల సామర్థ్యంతో ఉంది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలోని లోతట్టు ప్రాతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. సోమవారం మంచిర్యాల తహసీల్దార్ రాజేశ్వర్‌తో కలిసి జిల్లా కేంద్రంలోని గోదావరి నది తీర ప్రాంతం, బైపాస్ రోడ్డు ఏసీసీ ప్రాంతాల్లో రాళ్లవాగు వరదను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికార యంత్రాంగం ప్రజలకు అందుబాటులో ఉంటుందని, అత్యవసర సేవల నిమిత్తం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నం 08736–250501 ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

ఎన్నికల ప్రక్రియ షురూ !

- 'పోలింగ్' కోసం ఉద్యోగ, ఉపాధ్యాయుల వివరాల సేకరణ
- విధుల్లో పాల్గొనే వారి సమాచారం క్రోడీకరణ
- ఓటింగ్ సజావుగా సాగేందుకు చర్యలు



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ విధులు సజావుగా నిర్వర్తించేందుకు అవసరమైన ఉద్యోగ, ఉపాధ్యాయుల వివరాల సేకరణ మొదలైంది. పోలింగ్ నిర్వహణకు జిల్లాలో ఎంతమంది సిబ్బంది ఉన్నారు..? పోలింగ్ కేంద్రాల వారీగా విధుల కేటాయింపు, స్థానికేతరులు, స్థానికులు, సొంత నియోజకవర్గం తదితర వివరాల సేకరణ ప్రక్రియ సాగుతోంది. వచ్చే డిసెంబర్‌లోపు రాష్ట్ర శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. మరో రెండు నెలల్లో షెడ్యూల్, ఆ తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. దీంతో ఆ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రక్రియ వేగవంతం చేసింది. ఇందులో భాగంగానే ఎన్నికల విధులు నిర్వర్తించే వారి వివరాలు తీసుకుంటున్నారు. ఇందుకోసం జిల్లాలో నోడల్ ఆఫీసర్‌ను నియమించి ప్రత్యేక ఫార్మాట్‌లో సమాచారం సేకరిస్తున్నారు. ఆయా ప్రభుత్వ శాఖాధిపతుల నుంచి తమ సిబ్బంది వివరాలు తీసుకుంటున్నారు.

45అంశాలపై సమాచారం

ఉద్యోగి ట్రెజరీలో జీతం తీసుకునే ఐడీ నంబరు నుంచి మొదలు ఆ అధికారి హోదా, ఏ శాఖ, ఏ నియోజకవర్గం పరిధిలో పని చేస్తున్నారు.. పోలింగ్ సమయంలో ఏయే నియోజకవర్గంలో ఉంటారు.. సొంత ఊరు, ఏ నియోజకవర్గ పరిధిలోకి వస్తుంది.. ప్రస్తుత, శాశ్వత చిరునామాలు, అడ్రస్, ఈ మెయిల్, బంధుత్వం, దివ్యాంగులా? వంటి వ్యక్తిగత వివరాలు కూడా తీసుకుంటున్నారు. అంతేగాక గత ఎన్నికల్లో ఏ పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వర్తించారు.. ఉద్యోగి ఓటరు ఐడీ కార్డు, నేర చరిత్ర ఉందా?.. బ్యాంకు వివరాలతోపాటు ఇతర అంశాలను ఆ ఫార్మాట్ ప్రకారం సేకరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పని చేస్తున్న అధికారులు, పది నియోజకవర్గాల పరిధిలో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సర్వీసుతోపాటు అన్ని అంశాలు తీసుకుంటున్నారు. ఎన్నికల సంఘానికి జిల్లా కలెక్టర్ నుంచి సమాచారం వెళ్లనుంది. మంచిర్యాల జిల్లాలో సేకరించిన వివరాల ప్రకారం అన్నిశాఖల నుంచి 3,822 మంది సిబ్బంది ఉన్నట్లు తేలింది. ఇంకా ఏవైనా మార్పులు చేర్పులు ఉంటే చేస్తున్నారు.

ఉద్యోగుల వివరాలు సేకరిస్తున్నాం

వచ్చే ఎన్నికల దృష్ట్యా పోలింగ్ విధుల్లో పాల్గొనే ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల వివరాలు సేకరిస్తున్నాం. ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఫార్మాట్‌లో ఆయా శాఖాల నుంచి సిబ్బంది వివరాలు తీసుకున్నాం.

– యాదయ్య, డీఈవో, నోడల్ ఆఫీసర్, ఎలక్షన్ మ్యాన్‌పవర్

పోలింగ్ సిబ్బందే కీలకం

వచ్చే అసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం తమ పనులను ముమ్మరం చేసింది. ఇందులో ప్రధానంగా పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగాలంటే సిబ్బందే కీలకం. ఈ క్రమంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆయా నియోజకవర్గాలకు ఆర్వో (రిటర్నింగ్ ఆఫీసర్), ఏఆర్వో(అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్)లను నియమించింది. ఇక ఓటరు జాబితా మార్పులు చేర్పులు, సవరణలకు అవకాశం, ఈవీఎం పరిశీలనలు, రాజకీయ పార్టీలకు అవగాహన కల్పిస్తోంది. అన్ని నియోజకవర్గాల్లో మాక్ పోలింగ్‌లు ఏర్పాటు చేస్తూ ప్రజలకు ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్నారు. మొబైల్ వాహనాలు ఏర్పాటు చేసింది. తాజాగా ఉద్యోగుల వివరాలు సేకరిస్తూ పోలింగ్ సజావుగా సాగేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి

- మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్
- కలెక్టరేట్ ఎదుట బీజేపీ ధర్నా



మాట్లాడుతున్న రాథోడ్ రమేశ్

నస్పూర్: జిల్లాలో అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ డిమాండ్ చేశారు. సోమవారం పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో సమీకృత కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. రాథోడ్ రమేశ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెర్రబెల్లి రఘునాథ్ మాట్లాడుతూ అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు జిల్లా అభివృద్ధికి నిధులు తీసుకు రావడంలో విఫలమయ్యారని విమర్శించారు. జిల్లాలో అర్హులైన వారికి డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించడానికి 330 మందిని గత ఆరు నెలల క్రితం లాటరీ ద్వారా ఎంపిక చేశారని, వారికి నేటికీ ఇళ్లు ఎందుకు కేటాయించడం లేదని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు 1400 మంది పేదలకు చెల్లని ఇంటి స్థలాల పట్టాలు ఇచ్చి మోసం చేశారని అన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ సురేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ పట్టణ అధ్యక్షుడు కౌన్సిలర్ అగల్‌డ్యూటి రాజు, ముల్కల మల్లారెడ్డి, అందుగుల శ్రీనివాస్, ఆకుల అశోక్ వర్ధన్, మునిమంద రమేశ్, పానుగంటి మధు, పట్టి వెంకటకృష్ణ, వెంకటేశ్వర్‌రావు, కిషన్, హరిగోపాల్, రాజయ్య, నర్సింగ్, వేల్పుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బోదకాల నివారణపై అవగాహన



మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్

మంచిర్యాలటౌన్: జిల్లాలో బోదకాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కీటక జనిత వ్యాధుల నివారణ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, హెల్త్, వెల్‌నెస్, ఎంఎల్‌హెచ్‌పీఎస్‌లకు బోదకాల నివారణ అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వెంకటేశ్ మాట్లాడుతూ జిల్లాలో బోదకాల వ్యాధి పూర్తిస్థాయిలో తగ్గుముఖం పట్టలేదని, ఆగస్టు 10, 11, 12 తేదీల్లో బూత్ లెవల్‌లో, 13 నుంచి 19వరకు ఇంటింటికీ వెళ్లి మాత్రలు వేయిస్తామని తెలిపారు. ఎవరైనా మాత్రలు వేసుకోకుండా ఉంటే 20, 21, 22 తేదీల్లో మాపప్ ద్వారా వేయాలని తెలిపారు. డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనిత, డీఎస్‌వో డాక్టర్ ఫయాజ్‌ఖాన్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఆర్టీసీ ఆర్‌ఎంగా సోలమన్



బాధ్యతలు స్వీకరిస్తున్న సోలమన్

ఆదిలాబాద్: ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌గా పి.సోలమన్ సోమవారం ఆదిలాబాద్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటివరకు హైదరాబాద్‌లో చీఫ్‌ట్రాఫిక్ మేనేజర్ (ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్)గా విధులు నిర్వహించగా, ఆదిలాబాద్ ఆర్‌ఎంగా బదిలీ చేస్తూ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు ఇక్కడ ఆర్‌ఎంగా పనిచేసిన జానీరెడ్డి నిజామాబాద్‌కు బదిలీపై వెళ్లారు.

అదనపు కలెక్టర్‌గా మోతిలాల్



మోతిలాల్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా అదనపు కలెక్టర్‌గా మోతిలాల్‌ను నియమిస్తూ ప్రభుత్వ పరిపాలన విభాగం కార్యదర్శి ప్రిన్సిపల్ నవీన్ మిట్టల్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న వెయిటింగ్‌లో ఉన్న ఆయనను పదోన్నతిపై జిల్లాకు బదిలీ చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌ను ఖమ్మం జిల్లాకు బదిలీ చేస్తూ ఈ నెల 19న ఉత్వర్వులు జారీ చేసిన వేషయం తెలిసిందే. ఆయన స్థానంలో మోతిలాల్‌ను నియమించారు. మంచిర్యాల ఆర్డీవో వేణును స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా మహబూబ్‌నగర్ జిల్లాకు బదిలీ చేయగా ఆయనను పదోన్నతిపై కుమురంభీం జిల్లాకు అదనపు కలెక్టర్‌గా బదిలీ చేశారు.

ప్రత్యేక ఓటరు శిబిరాలు

మంచిర్యాలఅగ్రికల్చర్: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆగస్టు 26, 27, సెప్టెంబర్ 2, 3న ప్రత్యేక ఓటరు శిబిరాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్, ఎన్నికల అధికారి సంతోష్ తెలిపారు. నూతన ఓటరు నమోదు, సవరణలు, మార్పులు, తొలగింపుల దరఖాస్తులు స్వీకరిస్తామని, ట్రాన్స్ జెండర్లు, దివ్యాంగులు, 18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని, బీఎల్‌వోలు ఉదయం 8గంటలకు విధులకు హాజరు కావాలని తెలిపారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

- కలెక్టర్ బాదావత్ సంతోష్
- ప్రజల నుంచి అర్జీల స్వీకరణ



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ సంతోష్

నస్పూర్: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. సమీకృత కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ సంతోష్ అదనపు కలెక్టర్ బి.రాహుల్, ట్రైనీ కలెక్టర్ పి.గౌతమి, ఆర్డీఓలు దాసరి వేణు, శ్యామలాదేవిలతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. 75దరఖాస్తులు అందాయని, పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. భూసమస్యలు, మీ సేవ కేంద్రం మంజూరు చేయాలని దరఖాస్తులు అందజేశారు. రోడ్డు నిర్మాణానికి అనుమతించాలని నస్పూర్ కౌన్సిలర్ మేకల దాసు కోరారు.

- తన భర్త మంద రవి బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామ సర్పంచ్‌గా ఉన్న సమయంలో 2014 జూన్ 21న కొందరు పంచాయతీ కార్యాలయంలో హత్య చేశారని, జీవనాధారానికి భూమి కేటాయించాలని కోరగా అప్పటి కలెక్టర్ సూచన మేరకు తహసీల్దార్ కన్నాల గ్రామ శివారులో కొంత భూమి కేటాయించారని, ప్రోసిడింగ్ ఇస్తేనే భూమి సాగు చేసుకోవాలని ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది అడ్డుకుంటున్నారని మంద అనిత ఫిర్యాదు చేసింది.
- తాండూర్ మండలం కేజీబీవీ ప్రత్యేక అధికారి పి.కవితపై చర్యలు తీసుకోవాలని హెడ్‌కుక్ షెహనాబేగం, అటెండర్ ఎస్.సరిత, అసిస్టెంట్ కుక్ కే.రజిత, ఎల్.విజయలక్ష్మి, స్వీపర్లు జి.శంకరమ్మ, ఎస్.శారదమ్మ కోరారు. విద్యార్థులు, తమను మానసికంగా ఒత్తిడికి గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ఇంటి పనులు కూడా చేయిస్తోందని ఆరోపించారు. డే వాచ్ ఉమన్ జ్యోతి కొన్ని నెలల క్రితం ఉద్యోగం మానేసినా ఆమె పేరిట జీతం తీసుకుంటోందని పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలు అందించాలి

సంక్షేమ పథకాలు అందించాలని మోడ్రన్ అవెర్నెస్ సొసైటీ సభ్యులు ఆరాధన, శ్రావణి, హారిక, తదితరులు డిమాండ్ చేశారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ట్రాన్స్‌జండర్లం అయిన తమకు ఆసరా పింఛన్, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ప్రత్యేక ఆరోగ్యశ్రీ, విద్య, ఉద్యోగ, ఉపాధిలలో ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని పేర్కొన్నారు.

వీఆర్‌ఏలు రెగ్యులరైజ్

- సర్వీస్ క్రమబద్ధీకరిస్తూ జీవో జారీ
- విద్యార్హతల ఆధారంగా కనీస వేతనం
- నేడు ఆయా శాఖల్లో సర్దుబాటయ్యే అవకాశం
- సంబరాల్లో వీఆర్‌ఏలు

కైలాస్‌నగర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): వీఆర్‌ఏలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. వీరంతా ఇక ప్రభుత్వ ఉద్యోగులుగా మారనున్నారు. రెవెన్యూశాఖలో ఏళ్లుగా పనిచేస్తున్న వీరి సర్వీస్‌ను క్రమబద్ధీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. చాలీచాలని వేతనాలతో సేవలందిస్తున్న వీరిని విద్యార్హతల ప్రకారం వివిధ శాఖల్లో సర్దుబాటు చేయాలని భావిస్తున్న ప్రభుత్వం, దాని ఆధారంగానే వారికి కనీస వేతనం నిర్ణయించింది. సర్కారు నిర్ణయంపై వీఆర్‌ఏల్లో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ఉమ్మడి జిల్లాలో 1,991 మంది..

వీఆర్‌ఏల సర్వీస్ క్రమబద్ధీకరణతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 1,991 మందికి మేలు చేకూరనుంది. డిగ్రీ ఆపై విద్యార్హతలు ఉన్నా ఇన్నాళ్లు అరకొర వేతనాలతో కింది స్థాయిలో సేవలందిస్తున్న వారికి విద్యార్హతల ప్రకారం ఉద్యోగాలు దక్కనున్నాయి. అత్యధికంగా నిర్మల్ జిల్లాలో 740 మంది రెగ్యులరైజ్ కాగా, మంచిర్యాలలో 542, ఆదిలాబాద్‌లో 392, కుమురంభీం ఆసిఫాబాద్‌లో 317 మంది ప్రభుత్వ ఉద్యోగులుగా మారనున్నారు.

విద్యార్హతల ప్రకారం పేస్కేల్

వీఆర్‌ఏ వ్యవస్థను శాశ్వతంగా రద్దు చేసి, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా నియమిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించిన మరుసటి రోజే రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌ఏల్లో డిగ్రీ, ఆపై విద్యార్హతలు కలిగిన వారిని అవసరమైన ప్రభుత్వశాఖల్లో జూనియర్ అసిస్టెంట్లుగా నియమిస్తారు. ఇదే అర్హతతో మున్సిపాలిటీలకు కేటాయిస్తే వారిని వార్డు అధికారులుగా నియమిస్తారు. వీరికి రూ.24,280 కనీస వేతనంగా నిర్ణయించారు. అలాగే ఇంటర్మీడియెట్ అర్హత కలిగిన వారిని రికార్డు అసిస్టెంట్లుగా నియమించనున్నారు. వీరికి రూ.22,240 వేతనంగా నిర్ణయించారు. పదో తరగతి వరకు చదువుకున్న వారికి ప్రభుత్వం నిర్ణయించిన శాఖల్లో ఆఫీస్ సబార్డినేట్, హెల్పర్లుగా నియమించనున్నారు. వీరికి రూ.19వేల కనీస వేతనం చెల్లించనున్నారు. ఇప్పటి వరకు రూ.11,700 వేతనం మాత్రమే పొందుతున్న వీఆర్‌ఏలు ఇకపై భారీ వేతనాలు అందుకోవడంతో పాటు ప్రత్యేక అలవెన్సులు, ఉద్యోగ భద్రత పొందనున్నారు. అలాగే విధి నిర్వహణలో మరణించిన వీఆర్‌ఏల వారసులకు కారుణ్య నియామకాల కింద వారి విద్యార్హతల ప్రకారం ఉద్యోగాలు కల్పించనున్నారు.

శాఖల సర్దుబాటుపై ఉత్కంఠ

సర్వీస్ క్రమబద్ధీకరిస్తూ వేతనాలు ఖరారు చేసిన ప్రభుత్వ నిర్ణయాన్ని వీఆర్‌ఏలు స్వాగతిస్తూ సంబరాలు జరుపుకున్నారు. అయితే వారిని ఆయా శాఖలకు ఇంకా సర్దుబాటు చేయకపోవడంతో ఏ శాఖకు కేటాయిస్తారనేదానిపై వారిలో ఉత్కంఠ నెలకొంది. అయితే మిషన్ భగీరథ, సాగునీటి పారుదలశాఖ, మున్సిపల్, పంచాయితీరాజ్ శాఖల్లో సర్దుబా టు చేసేందుకు ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. ఇందులో ఎంత మంది ఏ శాఖకు వెళ్లేది ఇంకా ఖరారు కాలేదు. శాఖల వారీగా సర్దుబాటు చేసే ప్రక్రియను మంగళవారం లోగా పూర్తి చేసి జీవో జారీ చేసే అవకాశమున్నట్లుగా అధికారులు చెబుతున్నారు.

జిల్లాల వారీగా వీఆర్‌ఏల విద్యార్హతల వివరాలు

జిల్లా	డిగ్రీ, ఆపై	ఇంటర్	పదో తరగతి	తొమ్మిదిలోపు, నిరక్షరాస్యులు
ఆదిలాబాద్	63	63	63	203
మంచిర్యాల	94	79	91	278
కుమురంభీం	52	55	36	174



మేమూ ప్రభుత్వ ఉద్యోగులం



వీఆర్‌ఓల వ్యవస్థ రద్దు చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ సీఎం కేసీఆర్ ప్రకటించడంతో ఎనలేని సంతోషాన్ని కలిగిస్తోంది. నిజాంకాలం నుంచి నుంచి ఇప్పటి వరకు వివిధ రకాల పనుల్లో భాగస్వామ్యం అవుతుండడంతో నేటి కాలంలో మాపై చాలా పని భారం పడింది. న్యాయమైన డిమాండ్ల కోసం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుండడంతో ఇన్నాళ్లకు గుర్తించడం ఆనందంగా ఉంది. ప్రభుత్వ ఉద్యోగులుగా ఆత్మ గౌరవంతో ఇక పని చేస్తాం.

– సాగె ఓంకార్, వీఆర్‌ఏ జేఏసీ జిల్లా చైర్మన్, మంచిర్యాల

పూర్తయిన తాత్కాలిక కల్వర్టు



పూర్తయిన కల్వర్టు వద్ద పోలీసులు

వేమనపల్లి: ఎట్టకేలకు నీల్వాయి అటవీ ప్రాంతంలో భారీ వర్షాలకు కూలిన కల్వర్టుల వద్ద తాత్కాలిక మరమ్మతులు పూర్తయ్యాయి. కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆదేశాలతో ఆర్‌అండ్‌బీ, పోలీసులు రంగంలోకి దిగారు. చెన్నూర్ సబ్‌డివిజన్ డీఈ రమేష్, రూరల్ సీఐ విద్యాసాగర్, ఎస్సై సుబ్బారావు, హెడ్‌కానిస్టేబుల్ లింగారెడ్డి పొద్దంతా కల్వర్టు వద్ద ఉండి పనులు చేయించారు. జేసీబీ సహాయంతో రెండు వరుసల పైపులు సరి చేసి ఇసుక బస్తాలతో రివిట్‌మెంట్ చేశారు. భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో మొరం, మట్టి తీసుకువచ్చి రోడ్డుకు సమాంతరంగా నింపారు. దీంతో సాయంత్రం వరకు తాత్కాలిక కల్వర్టు పైనుంచి రాకపోకలు ప్రారంభమయ్యాయి. మల్లంపేట మీదుగా మండల కేంద్రంతోపాటు కన్నెపల్లి, దహెగాం, భీమిని, నెన్నెల, మహారాష్ట్ర సరిహద్దు గ్రామాలకు రాకపోకలు ప్రారంభమయ్యాయి.

గుప్పుమంటున్న గుడుంబా

- పల్లెల్లో ఏరులై పారుతున్న నాటుసారా
- కుటీర పరిశ్రమను తలపిస్తున్న దందా
- పచ్చని సంసారాల్లో చిచ్చు
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు



నెన్నెల తండాలో తయారు చేస్తున్న గుడుంబా



కొత్తూర్ తండాలో దాడులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు (ఫైల్)

నెన్నెల(బెల్లంపల్లి): పచ్చని పల్లెల్లో గుడుంబా గుప్పుమంటోంది. అమాయకుల ప్రాణాలను హరించి వేస్తున్న సారా దందా యథేచ్ఛగా సాగుతోంది. తాగడానికి నీరు దొరకని గ్రామాల్లోనూ నాటుసారా పుష్కలంగా లభిస్తోంది. కలుషితమైన నీరు, పటిక, బెల్లం, కుళ్లిన పండ్లు, రబ్బరు జీడి గింజలు, కొడిష, తుమ్మచెక్క, యూరియా, తదితర ప్రమాదకర ఘాటు పదార్థాలను కలిపి తయారుచేస్తున్న నాటుసారాతో ఎంతోమంది అమాయకుల ప్రాణాలు బలి అవుతున్నాయి. బానిసైన పలువురు అనారోగ్యం పాలై ప్రాణాలు కోల్పోవడంతో చిన్నతనంలోనే వితంతువులుగా మారిన మహిళలు అష్టకష్టాలు పడుతూ పిల్లలను పోషించుకుంటున్నారు. గుడుంబా తయారీ, విక్రయాలపై అడిగేవారు, ఆపేవారు లేకపోవడంతో ఈ దందా 'మూడు పవ్వలు, ఆరు సీసాలు'గా సాగుతోంది. బెల్లంపల్లి నియోజకవర్గంలోని నెన్నెల, బెల్లంపల్లి, కాసిపేట, తాండూర్, భీమిని, కన్నెపల్లి, వేమనపల్లి మండలాల్లో గుడుంబాను తయారు చేసి చుట్టుపక్కల ప్రాంతాలు, పట్టణాలకు తరలిస్తున్నారు.

ప్రత్యేక విక్రయ కేంద్రాల ఏర్పాటు

ప్రభుత్వం మద్యం ధరలు విపరీతంగా పెంచడం గుడుంబా విక్రయదారుల పాలిట వరంగా మారింది. తండాలకే పరిమితమైన ఈ గుడుంబా తయారీని అన్నివర్గాల ప్రజలు కుటీర పరిశ్రమగా మార్చుకున్నారు. ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసుకుని మరీ విక్రయించే స్థాయికి దందా చేరుకుంది. మద్యం ధరలు అధికంగా ఉండడం, సమీపంలో దొరికే గుడుంబా తక్కువ ధరకే లభిస్తుండడంతో నిరుపేదలు, కూలీలు గుడుంబాకు బానిసలుగా మారి వారి విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.

మామూళ్ల మత్తులో యంత్రాంగం

నాటుసారాను నియంత్రించే ఎక్సైజ్ అధికారులు అడపాదడపా దాడులు నిర్వహిస్తున్నారని, మామూళ్లకు కక్కుర్తిపడి తూతూమంత్రంగా తనిఖీలు చేపడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పట్టుబడినప్పటికీ కఠిన చర్యలు తీసుకోకపోవడంతో మళ్లీ గుడుంబా వ్యాపారం సాగిస్తున్నారు.

బెల్లం, పటిక విక్రయాలు అరికడితేనే..

బెల్లం, పటిక రవాణాకు అధికారుల అండదండలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. గుడుంబా తయారీకి వినియోగించే ముడిసరుకు అయిన బెల్లం, పటిక విక్రయాలను అరికట్టినట్లయితే సగం విజయం సాధించినట్లే. గ్రామాల్లోని కొన్ని కిరాణషాపుల్లో బెల్లం, పటిక నిల్వలు ఉన్నట్లు అధికారులకు తెలిసినా చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు బెల్లం, పటిక విక్రయాలు నియంత్రిస్తే లక్ష్యం నెరవేరుతుందని పలువురు పేర్కొంటున్నారు.

ఇటీవల జరిగిన దాడులు కొన్ని

- జూన్ 3న నెన్నెల మండలం చిన్నలంబాడితండా, పెద్దతండాలతో పాటు నార్వాయిపేట తండాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి 700 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశారు.
- జూలై 4న కన్నెపల్లి మండలం మెట్‌పల్లిలో పోలీసులు, ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి 5 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని ఐదుగురిపై కేసు నమోదు చేశారు.
- జూలై 11న భీమిని మండలంలోని చిన్నగుడిపేట లంబాడితండాలో పోలీసులు, ఎక్సైజ్ అధికారులు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి 200 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేసి సీతారాం అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు.
- జూలై 12న నెన్నెల మండలం చామనపల్లి, గుడిపేటనుంచి ద్విచక్రవాహనంపై గుడుంబాను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని 8లీటర్ల గు డుంబాతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

కేసులు నమోదు చేస్తాం



పోలీసుల సహకారంతో నాటుసారా స్థావరాలపై దాడులు ముమ్మరం చేసి క్రిమినల్, పీడీయాక్టు కేసులు నమోదు చేస్తాం. గుడుంబా తయారీ, విక్రయదారుల వివరాలు సేకరించి బైండోవర్ చేస్తున్నాం. గ్రామాలకు వెళ్లే బెల్లాన్ని కట్టడి చేస్తాం. ఎలాంటివారినైనా వదిలిపెట్టేది లేదు.
– హరి, ఎక్సైజ్ సీఐ, చెన్నూర్

క్లుప్తంగా

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కార్గో బస్సు



బస్సుపై విద్యుత్ తీగలు

జన్నారం(ఖానాపూర్): ఆర్టీసీ కార్గో బస్సుకు పెను ప్రమాదం తప్పింది. జన్నారం మండలం రాంపూర్‌లో సోమవారం అంగన్‌వాడీ కేంద్రంలో సరుకులు వేసే క్రమంలో బస్సును తిప్పుతుండగా గమనించని డ్రైవర్ వెనుక ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో స్తంభం విరిగి విద్యుత్ వైర్లు బస్సుపై పడ్డాయి. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

వృద్ధుడి మృతదేహం లభ్యం



పంచనామా చేస్తున్న ఎస్సై రమేశ్

సిర్పూర్(టి): మండలంలోని లక్ష్మీపూర్ వాగులో ఆదివారం గల్లంతైన వృద్ధుడి మృతదేహం లభ్యమైంది. ఎస్సై డీకొండ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గంట చీకటి (68) తన మనుమడితో కలిసి ఎడ్లను మేపేందుకు పంట చేను సమీపంలోకి వెళ్లాడు. అందులోని ఒక ఎద్దు వాగులోని వరద నీటిలో చిక్కుకుంది. ఎద్దును రక్షించేందుకు వెళ్లి గల్లంతయ్యాడు. ఒడ్డున ఉన్న మనుమడు కేకలు వేయడంతో చుట్టుపక్కల ఉన్న రైతులు వచ్చి వాగులో గాలించినా ఆచూకీ లభించలేదు. సోమవారం వాగులో మృతదేహం లభ్యం కావడంతో మృతుని భార్య ఈశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వేధింపుల కేసులో జైలుశిక్ష

బెల్లంపల్లి: భార్యను శారీరకంగా, మానసికంగా వేధించిన భర్తకు సోమవారం బెల్లంపల్లి న్యాయస్థానం జైలుశిక్ష, జరిమానా విధించినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ టి.శంకరయ్య తెలిపారు. పోస్టాఫీసు బస్తీకి చెందిన రజితకు చెన్నూర్‌కు చెందిన ముల్కనూరి శ్రీనివాస్‌తో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. అప్పటి నుంచి అదనపుకట్నం తీసుకు రావాలని శ్రీనివాస్ వేధింపులకు పాల్పడుతుండటంతో 2013లో రజిత వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌హెచ్‌ఓ కర్రె స్వామి కేసు నమోదు చేశారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అజయ్‌కుమార్ ఆరుగురు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో బెల్లంపల్లి జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎస్.ముకేష్ నిందితుడు శ్రీనివాస్‌కు ఏడాది సాధారణ జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు.

మందమర్రిరూరల్: భార్యను వేధించిన కేసులో భర్తకు ఏడాది జైలుశిక్షతో పాటు రూ. 500 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు వెల్లడించారని ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. మందమర్రి మండలం చిర్రకుంట గ్రామానికి చెందిన శృతికి పెద్దపల్లి జిల్లా సూరారంకు చెందిన శంకర్ రెడ్డితో 2013లో వివాహమైంది. అదనపు కట్నం కోసం వేధిస్తుండడంతో 2017 ఫిబ్రవరి 11లో మందమర్రి పోలీస్ స్టేషన్‌లో భర్త శంకర్‌రెడ్డి, అత్త మల్లమ్మపై కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో నాయ్యమూర్తి ఉపనిషద్వని తీర్పు వెలువరించారు.

క్లోరినేషన్ పనుల్లో సర్పంచ్ భర్త



బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న వెంకటేశ్

నెన్నెల(బెల్లంపల్లి): పాలకులు అంటే ఖద్దర్ బట్టలే కాదు.. సమయం వచ్చినప్పుడు కార్మికుల్లా మారి ప్రజాసేవ చేయాలని చిత్తపూర్ సర్పంచ్ బత్తిని పద్మ భర్త వెంకటేశ్ నిరూపిస్తున్నాడు. గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మెలో ఉండడంతో గ్రామంలోని డ్రెయినేజీలు, బావులు, వాటర్ ట్యాంకుల్లో బ్లీచింగ్ పౌడర్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకోసం తనవంతు సేవచేయడం ఆనందంగా ఉందన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

చెన్నూర్: మండలంలోని బావురావుపేట సమీపంలో గల రాజేశ్వరి బ్రిక్స్ ఇండస్ట్రీస్‌లో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐ వాసుదేవరావు తెలిపారు. సోమవారం రాత్రి దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న నరేందర్, పున్నం బాపు, రామడుగు ప్రకాశ్, కొమటిపల్లి రమేశ్, వేముగంటి శ్రావణ్‌రెడ్డి, పెద్ది సమ్మయ్య, గుండపు లక్ష్మీనారాయణలను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.31,290 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్

జన్నారం(ఖానాపూర్): పదేపదే అడవిలోకి వెళ్లి చెట్లు నరుకుతున్నాడన్న అభియోగంపై జన్నారం మండలం చింతగూడ గ్రామానికి చెందిన పానగంటి శ్రీనివాస్‌ను సోమవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు అటవీశాఖ సెక్షన్ అధికారి శివకుమార్ తెలిపారు.

కార్మికుల పక్షపాతి సీఎం కేసీఆర్

- టీబీజీకేఎస్ స్టేట్ జనరల్ సెక్రెటరీ మిర్యాల రాజిరెడ్డి



మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

నస్పూర్(మంచిర్యాల): కార్మికుల పక్షపాతి సీఎం కేసీఆర్‌అని టీబీజీకేఎస్ స్టేట్ జనరల్ సెక్రెటరీ మిర్యాల రాజిరెడ్డి అన్నారు. సోమవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 6 గనిపై గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణిలో కారుణ్య నియామకాల ద్వారా, మెడికల్ ఇన్వాలిడేషన్ ద్వారా 15 వేల మంది కార్మికులకు ఉద్యోగాలు ఇప్పించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. ఇంటర్నల్ ఎక్స్‌టర్నల్ ద్వారా మరో ఐదువేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. 2022 నాటికి ఉద్యోగంలోకి వచ్చి 190 అండ్ 240 మస్టర్లు నిండిన ప్రతీ బదిలీ వర్కర్ కార్మికునికి నెల రోజుల్లో జనరల్ మజ్దూర్ ఇప్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు కే.సురేందర్‌రెడ్డి, కేంద్ర ఉపాధ్యక్షులు డీకొండ అన్నయ్య, మంద మల్లారెడ్డి, ఏరియా జీఎం చర్చల ప్రతినిధులు పెట్టం లక్ష్మణ్, వెంగళ కుమారస్వామి, బ్రాంచి సెక్రెటరీ పానుగంటి సత్తయ్య, అసిస్టెంట్ పిట్ సెక్రెటరీ ఇప్ప భూమయ్య, నాయకులు అడ్డు శ్రీనివాస్, రమేశ్, సంతోష్, వెంకటరాజం, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్ కలెక్టర్‌కు రెండేళ్ల జైలు

బెల్లంపల్లి: విద్యుత్ వినియోగదారుల వద్ద నుంచి బిల్లులు వసూలు చేసి సొంతానికి వాడుకున్న ఓ కాంట్రాక్ట్ బిల్ కలెక్టర్‌కు బెల్లంపల్లి న్యాయస్థానం జైలుశిక్ష, జరిమానా విధించినట్లు టూటౌన్ ఎస్సై రవికుమార్ తెలిపారు. కాల్‌టెక్స్‌కు చెందిన తుమ్మ సౌమిత్‌రాజ్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కాంట్రాక్ట్ బిల్ కలెక్టర్‌గా పనిచేస్తున్నాడు. వినియోగదారుల వద్ద నుంచి నెలవారీగా బిల్లులు వసూలుచేసి సొంతానికి వాడుకున్నాడు. 2022లో అకౌంటెంట్ గండి శ్రీనివాసరావు టూటౌన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేశారు. నిందితుడిపై కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయడంతో పబ్లిక్ ప్రాసిక్యూటర్ అజయ్‌కుమార్ ప్రధాన సాక్షులను ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎస్.ముకేష్ ముందు ప్రవేశ పెట్టారు. నేరం రుజువు కావడంతో తుమ్మ సౌమిత్ రాజ్‌కు రెండేళ్ల జైలు, రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

28 నుంచి అమరుల సంస్మరణ వారోత్సవాలు

- మావోయిస్టు పార్టీ కుమురంభీం, మంచిర్యాల డివిజన్ కమిటీ కార్యదర్శి భాస్కర్

కాగజ్‌నగర్‌రూరల్: మావోయిస్టు ఉద్యమంలో అలుపెరగని పోరాటం చేసిన అమరులను స్మరిస్తూ ఈ నెల 28 నుంచి ఆగస్టు 3 వరకు వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలని మావోయిస్టు పార్టీ కుమురంభీం, మంచిర్యాల డివిజన్ కమిటీ కార్యదర్శి భాస్కర్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. 2022 ఆగస్టు నుంచి 2023 జూలై వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పాశవికమైన విప్లవ ప్రతీఘాతుక సమాధాన్ దాడిని ఎదుర్కొంటూ విప్లవోద్యమాన్ని పురోగమింపజేయడానికి దేశవ్యాప్తంగా 100 మందికి పైగా విప్లవకారులు అమరులయ్యారని ఆయన పేర్కొన్నారు. వర్గ శత్రువుతో రాజీలేని పోరాటం చేస్తూ కుమురంభీం, మంచిర్యాల డివిజన్ కమిటీ డీవీసీఎం అనితక్క, అశోక్ (పార్టీసభ్యుడు) మహారాష్ట్ర సీ–60, ఛత్తీస్‌గఢ్ కమాండ్ డీఆర్‌జీ, తెలంగాణ గ్రేహౌండ్స్, కేంద్ర ఎన్‌జీ బలగాలతో వీరోచితంగా పోరాడుతూ నెత్తురు చిందించారన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. గ్రామగ్రామాన అమరవీరుల సంస్మరణ సభలు నిర్వహించి నివాళులు అర్పించాలని ఆయన ప్రజలను కోరారు.

విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌కు తావివ్వొద్దు



మాట్లాడుతున్న జడ్జి సంపత్

చెన్నూర్: విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌కు తావివ్వొద్దని సివిల్ జడ్జి సంపత్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలన్నారు. తోటి విద్యార్థుల మనోభావాలు దెబ్బతినే విధంగా ర్యాగింగ్‌కు పాల్పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. అనంతరం ర్యాగింగ్, మోటార్ వెహికల్ చట్టాలపై న్యాయవాదులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేశంగౌడ్, ఏజీపీ రాంబావు, న్యాయవాదులు రమేశ్‌చందర్ గిల్డా, మహేశ్, ఎస్సై వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న టీఎన్జీవోలు

మంచిర్యాలఅగ్రికల్చర్: మంచిర్యాల హౌసింగ్ సొసైటీ సమస్య పరిష్కరించాలని కలెక్టర్ బదావత్ సంతోష్‌కు టీఎన్జీవో నాయకులు సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో టీఎన్జీవో నాయకులు గడియారం శ్రీహరి, హబీబ్ హుస్సేన్, రాంమోహన్, హౌసింగ్ సొసైటీ సభ్యులు సంతోష్, శ్రీనివాస్ దేశ్‌పాండే, ఇంతియాజ్; సలీం, పేరం శ్రీనివాస్, శ్రీధర్, రాజు, సైండ్ల మొండయ్య, తదితరులు ఉన్నారు.

సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

పాత మంచిర్యాల: 2023–24 విద్యాసంవత్సరంలో సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు, అడ్మిషన్ ఇన్‌చార్జి ఎస్ నారాయణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్–2023లో ఉత్తీర్ణత పొందిన సింగరేణి ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల పిల్లలు, ఇతరులు ఆన్‌లైన్‌లో www. scp. scpolytechnic. com ద్వారా దరఖాస్తు చేసుకుని ఈ నెల 28న స్పాట్ అడ్మిషన్ సెంటర్‌కు రావాలని సూచించారు. సింగరేణి ఉద్యోగుల పిల్లలు లేనియెడల ఇతరులతో ఆ సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.16,580, ఇతరులు రూ.16,880 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. స్పాట్ అడ్మిషన్‌లో సీటు పొందిన వారికి స్కాలర్‌షిప్ వర్తించదని స్పష్టం చేశారు. పూర్తి వివరాలకు 9491144168, 8790112515 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి



లక్ష్మి (ఫైల్)

కాసిపేట: మండలంలోని దేవాపూర్‌లో సోమవారం విద్యుత్ షాక్‌తో మహిళ మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. గ్రామానికి చెందిన కటకం లక్ష్మి (48) తన ఇంట్లో ఫ్రిజ్‌ను శుభ్రం చేస్తుండగా షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి భర్త సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మిస్సింగ్ కేసు నమోదు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్‌కు చెందిన జనగామ సురేష్ అదృశ్యమైనట్లు ఎస్సై జగదీష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జగామ నరేష్ భార్య రక్షితల మధ్య కుటుంబ గొడవలు ఉండడంతో రక్షిత ఫిర్యాదుతో నరేష్ కుటుంబ సభ్యులతో పాటు అతని అన్న సురేష్‌పై రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. దీంతో మనస్తాపం చెందిన సురేష్ ఈ నెల 23న తన కూతురు నేహశ్రీ(8) కుమారుడు రుత్విక్ (6)లను వెంట తీసుకొని ఇంట్లోనుంచి వెళ్లిపోయాడు. ఆచూకీ లభించక పోవడంతో సురేష్ తమ్ముడు నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు తొలిమెట్టు

మంచిర్యాలఅర్బన్: విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు ఎఫ్‌ఎల్‌ఎన్ (తొలిమెట్టు) నిర్వహిస్తున్నామని డీఈవో యాదయ్య అన్నారు. సోమవారం మంచిర్యాలలో జిల్లా స్థాయిలో 1 నుంచి ఐదోతరగతి తెలుగు, ఆంగ్లం, గణితం విషయ బోధన ప్రణాళికలు, అభ్యాస పుస్తకాలపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల కనీస సామర్థ్యాలతో పాటు సబ్జెక్టు, తరగతి వారి అభ్యసన ఫలితాల సాధనను దృష్టిలో పెట్టుకుని శిక్షణ కార్యక్రమం రూపొందించడం జరుగుతుందన్నారు. కోర్సు డైరెక్టర్, సెక్టోరల్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి, సెరి ప్రాజెక్టు రాష్ట్ర కోఆర్డినేటర్ నితిన్, రూమ్‌టురీడ్ మంచిర్యాల జిల్లా లీడ్ మధు, తదితరులు పాల్గొన్నారు.

సెమీ ఫైనల్‌కు చేరిన సింగరేణి జట్టు



సింగరేణి జట్టు సభ్యులు

నస్పూర్: హైదరాబాద్‌లో జరుగుతున్న ఎస్‌ఎండీసీ క్రికెట్ టోర్నమెంటులో సింగరేణి జట్టు సెమీ ఫైనల్‌కు చేరినట్లు శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం పర్సనల్ అరవిందరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్(ఏ)లో సింగరేణి సహా ఈసీఐఎల్, మిథానీ, ఎస్‌ఆర్‌ఎస్‌ఈ, గ్రూపు(బి)లో ఎస్‌ఎండీసీ, బీఎస్‌ఎన్‌ఎల్, బీహెచ్‌ఈఎల్, హెచ్‌ఏఎల్ జట్లు ఉన్నాయి. ఈ నెల 16, 23 తేదీల్లో జరిగిన రెండు మ్యాచ్‌లలో విజయం సాధించడంతో సింగరేణి జట్టు సెమీ ఫైనల్‌కు చేరిందని అరవిందరావు తెలిపారు. సింగరేణి జట్టు విజయంలో కెప్టెన్ శశికాంత్, మిడిల్ ఆర్డర్ క్రీడాకారుడు శశ్వంత్, బౌలర్లు జగదీశ్, హరికిషన్, చిరంజీవి కీలక పాత్ర పోషించారని ఆయన పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు ఐఆర్‌తో కూడిన పీఆర్సీకి కృషి

జన్నారం: ఉపాధ్యాయులకు త్వరలోనే ఐఆర్‌తో కూడిన పీఆర్సీ అందేలా రాష్ట్ర సంఘం కృషి చేస్తోందని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. అనంతరం మండల కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు త్వరలోనే హెల్త్ కార్డులు అందించేలా, పెండింగ్ బిల్లులు మంజూరు చేసేలా సీఎంతో మాట్లాడామన్నారు. సమావేశంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కట్ట రాజమౌళి, ప్రధాన కార్యదర్శి నగూరి సత్యనారాయణ, రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షులు కొండు జనార్దన్, జాడి మురళి, విజయ చందర్, చంద్రశేఖర్, జాజల శ్రీనివాస్, ప్రభాకర్, కాంతయ్య, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలు



ఆంగ్ల అక్షరాలతో తయారు చేసిన గార్డెన్

బెల్లంపల్లి: రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ శ్రేణులు సోమవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపాలిటీలో ఎనిమిది చోట్ల గ్రంథాలయం రీడింగ్ రూమ్‌లను ప్రారంభించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మెగా ప్లాంటేషన్ ప్రారంభించారు. పచ్చని మొక్కలతో ఆంగ్ల అక్షరాలతో కేటీఆర్ అని తయారు చేసిన గార్డెన్ అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, కమిషనర్ కె.సమ్మయ్య, టీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలోని 22 వార్డు బూడిదగడ్డ బస్తీలో జీవో నెంబర్ 76 కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు సోమవారం ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్ ఇళ్లపట్టాలు అందజేశారు.

సంక్షిప్తం

గూడెం ఘాట్‌రోడ్డు పరిశీలన

దండేపల్లి: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయ ఘాట్ రోడ్డు 15 మీటర్ల పొడవున కూలిపోయింది. పంచాయతీరాజ్ విభాగం ఆదిలాబాద్ ఎస్ఈ వెంకట్రావ్, మంచిర్యాల ఈఈ ప్రకాశ్, ఏఈఈ తివారీ సోమవారం రోడ్డును పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు తెలిపారు.

పారిశుధ్య పనులు పరిశీలన

తాండూర్: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం బెల్లంపల్లి డీఎల్‌పీవో ఫణిందర్ రావు తనిఖీ చేశారు. పంచాయతీ కార్మికులు సమ్మెలో ఉన్నంత వరకు కూలీలతో రోజువారీగా చెత్త సేకరణ పనులు చేయించాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీవో సత్యనారాయణ, సర్పంచ్ క్రిష్టఫర్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

భీమిని: పారిశుధ్య చర్యలు చేపట్టాలని డీఎల్‌పీవో ఫణిందర్‌రావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు ప్రబలకుండా ఆయిల్ బాల్స్, ఫాగింగ్ చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సబ్దార్ అలీ, ఏపీవో భాస్కర్ రావు పాల్గొన్నారు.

పనివేళల మార్పు ఉపసంహరించుకోవాలి

మంచిర్యాలఅర్బన్: ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల పనివేళల మార్పు ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోళ్ల రామన్న, ప్రధాన కార్యదర్శి రాజావేణు డిమాండ్ చేశారు. ఉదయం 9గంటలకు బదులు 9.30 గంటలకు ప్రారంభించటం అశాస్త్రీయమన్నారు. పనివేళలు మార్చాలంటే నిపుణుల కమిటీ ఏర్పాటుచేసి విద్యార్థులు, తల్లిదండ్రులు తదితర భాగస్వాముల అభిప్రాయాలను సేకరించి నిర్ణయించాల్సి ఉంటుందన్నారు.

మైనార్టీ పాఠశాల ఉపాధ్యాయులకు మెమో జారీ

చెన్నూర్: పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు మరో ముగ్గురు ఉపాధ్యాయులు, నర్సులకు మెమో జారీ చేసినట్లు డీడబ్ల్యూవో రాజేశ్వరి తెలిపారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు వేధిస్తున్నారని ఫిర్యాదు మేరకు డీడబ్ల్యూవో రాజేశ్వరి సోమవారం పాఠశాలను సందర్శించి విచారణ జరిపారు. ఆర్‌ఎల్‌సీ శ్రీధర్, విజిలెన్స్ అధికారి రిటైర్డ్ ఎస్సై తాహేర్‌లు పాల్గొన్నారు.

శిథిలావస్థ భవనాల్లో ఉండవద్దు

మంచిర్యాలటౌన్: జిల్లాలో ఈనెల 25, 26, 27 తేదీల్లో భారీ వర్షాలు ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మున్సిపాలిటీలోని ప్రజలు శిథిలావస్థలో ఉన్న గృహాల్లో నివసించవద్దని కమిషనర్ మారుతి ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోదావరి నది, రాళ్లవాగు వరద ఉధృతి ఎక్కువగా పెరిగేందుకు అవకాశం ఉందని, ఎన్టీఆర్‌నగర్ కాలనీ, లేబర్ కాలనీ, రాంనగర్, సంజీవయ్య కాలని(బైపాస్ రోడ్డు), ఇస్లాంపుర, రాళ్లపేట ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వరద నీటి ప్రభావంతో ఇబ్బందులు ఉంటే 9849907886 నంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

పేమెంట్ ఆర్డర్ కాపీ అందజేత

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 6 గనిలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన సీహెచ్ కనకయ్యకు కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ నుంచి రావాల్సిన రివైజ్‌డ్ పెన్షన్ ఏరియర్స్‌కు సంబంధించిన పెన్షన్ పేమెంట్ ఆర్డర్ కాపీని డీజీఎం పర్సనల్ పి.అరవిందరావు అందజేశారు.